ప్రజాశక్తి

గురువారం 24 జనవరి 2025

5

విజయనగరం

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి.. పోలీసు, రెవెన్యూ అధికారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జాతీయ లోక్ అదాలత్‌పై జిల్లా పోలీస్, రెవెన్యూ అధికారులతో జిల్లా కోర్టు సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కాదగ్గ అన్ని క్రిమినల్ కేసులను, చెక్ బౌన్స్ కేసులను గుర్తించి, స్పెషల్ డ్రైవ్ చేపట్టి, జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. తద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కావని తెలిపారు. ఈ సమావేశంలో మొదటి జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.మీనాదేవి, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ కార్యదర్శి టి.వి.రాజేష్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవీ రత్నకుమారి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి బి.రమ్య, మొబైల్ కోర్టు న్యాయమూర్తి పి.బుజ్జి గారు, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు ముమ్మరం

- ఇప్పటి వరకు 1.45 కోట్ల పనిదినాలు
- రూ.334 కోట్ల చెల్లింపులు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జిల్లాలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల ఖరీఫ్ పంటల సాగు పనులు పూర్తి కావడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. కొద్ది రోజులుగా రోజు సుమారు 25 వేల మంది పనుల్లో పాల్గొంటున్నారని డ్వామా పీడీ శారదాదేవి చెబుతున్నారు. జనవరి 8వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించి కూలీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయినట్టు అధికారిక సమాచారం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ పంటలు మినహా రబీలో సీజన్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలు పెద్దగా లేకపోవడంతో కొన్ని దశాబ్దాలుగా ఉపాధి హామీ పనులే గత్యంతరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ చట్టం అమల్లో విజయనగరం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంటోంది. చాలాసార్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధికారులు అవార్డులు కూడా అందుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులతో జిల్లాలోని లక్షలాది కుటుంబాల జీవనం ముడిపడి ఉందని చెప్పుకోవచ్చు.

జిల్లాలో ప్రస్తుతం సుమారు 3.82 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. కార్డుదారుల్లో 8,076 మంది వికలాంగులు ఉన్నారు. 3.21 లక్షల కార్డులపై సుమారు 5 లక్షల మంది కూలీలు పనిలోకి వెళ్తున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ అమలు తీరును ఒకసారి పరిశీలిస్తే... గత ఆర్థిక సంవత్సరం (2023 ఏప్రిల్ ఒకటో తేది నుంచి 2024 మార్చి 31వ వరకు)లో జిల్లాలో 2.10 కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆచరణలో 1.18 కోట్ల పనిదినాలు కల్పించారు. రాష్ట్రంలో అతి ఎక్కువ పనిదినాలు కల్పించినట్టుగా జిల్లా రికార్డుకెక్కింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024 ఏప్రిల్ ఒకటో తేది నుంచి 2025 మార్చి 31 వరకు) 2.19 కోట్ల పనిదినాలు కల్పించాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఆచరణలో జనవరి 8 తేదీ వరకు 1.45 కోట్ల పనిదినాలు కల్పించారు. ఇందుకుగాను రూ.334 కోట్ల మేర చెల్లింపులు కూడా జరిగాయని అధికారులు చెబుతున్నారు.

శ్రమకు తగ్గ ఫలితమేది?

ఉపాధి పనుల కల్పన వరకు బాగానే ఉన్నా ఉపాధి కూలీలకు శ్రమకు తగ్గ ఫలితం మాత్రం రావడం లేదు. ప్రస్తుతం కల్పించిన పనిదినాలు, చెల్లింపుల ఆధారంగా పరిశీలిస్తే రోజుకు రూ.200 నుంచి రూ.230 మించి కూలి రావడం లేదన్నది తేలిపోయింది. గతంలో ఒకపూట పనిచేస్తేనే రూ.200 వచ్చేదని, రెండేళ్లుగా రెండు పూటలా పనిచేస్తున్నా రూ.230 మించి వేతనం రావడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు పని ప్రదేశాల్లో గతంలో కల్పించిన నీరు, నీడ వంటి సదుపాయాలు రద్దు చేశారు. వేసవి అలవెన్సులు, పార, తట్ట, గునపాం వంటి వాటికి ప్రత్యేక ఛార్జీలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. విజయనగరం పూర్తిగా వ్యవసాయాధారమైన జిల్లా. సారవంతమైన భూములు ఉన్నప్పటికీ పాలకులు సాగునీటి వనరులు కల్పించలేదు. పారిశ్రామికాభివృద్ధి లేదు. దీంతో ఏటేటా వలసలు పెరుగుతుండేవి. ఉపాధి హామీ చట్టం అమల్లోకి వచ్చాక క్రమంగా వలసలు తగ్గాయి. జ్యూట్‌మిల్లులు మూత, ఒడిదొడుకుల మధ్య నడుస్తున్న ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో ఉపాధి కోల్పోతున్న వారికి కూడా ఉపాధి పనులే జీవనాధారంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కష్టానికి తగ్గ ఫలితం, పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని, ఇతర అవెన్సులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

అందరి సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటాం

ఉపాధి హామీలో పనిచేస్తున్న సిబ్బంది, కూలీల సహకారంతో ఈ ఏడాది శత శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం. ముందుగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే రానున్న రెండు నెలల వారం రోజుల కాలంలో 74 లక్షల పనిదినాలు కల్పించాల్సి ఉంది. గడిచిన జూన్, జులై నుంచి వ్యవసాయ పనుల కారణంగా పనిదినాలు తగ్గాయి. ఆగస్టు తరువాత నామమాత్రంగానే పనిచేశారు. ఇటీవలే పనులు పున:ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం రోజుకు 25 వేల మంది పనుల్లోకి వస్తున్నారు. ఈనేపథ్యంలో వార్షిక లక్ష్యాన్ని చేరుకుంటామన్న నమ్మకం ఉంది.

- శారదాదేవి, డ్వామా పీడీ

మరో ముగ్గురికి డయేరియా

బిల్లలవలసలో 20కు చేరిన అతిసార రోగుల సంఖ్య

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని బిల్లలవలసలో గురువారం మరో ముగ్గురు డయేరియా బారిన పడ్డారు. దీంతో డయేరియా బారిన పడిన వారి సంఖ్య 20కు చేరింది. తాజాగా శాసుపల్లి సత్యవమ్మ, పత్తిగుల్ల సత్యంతోపాటు ఐదేళ్ల బాలుడు నక్కాన లాసిత్ కృష్ణ డయేరియా బారిన పడ్డారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు గ్రామంలో 16 మంది డయేరియాకు గురైన విషయం తెలిసిందే. బుధవారం ఒకరు, గురువారం ముగ్గురు డయేరియా బారిన పడ్డారు. వీరిలో 14 మంది కోలుకొని ఇళ్లకు చేరారు. విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇద్దరు, ప్రయివేటు ఆస్పత్రిలో ఒకరు, బిల్లలవలసలోని ఇళ్ల వద్ద మరో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. గ్రామంలో ఉన్న ముగ్గురు బాధితులకు వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. వైద్యాధికారి లెంక సత్యనారాయణ ఆధ్వర్యాన గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం గురువారం కూడా కొనసాగింది. వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. గ్రామస్తులకు ముందస్తు జాగ్రత్తలు చెబుతున్నారు. దేవుపల్లి నుంచి కార్మికులను తీసుకొచ్చి, గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

డయేరియా బారిన పడిన బాలుడు లాసిత్ కృష్ణ



మంత్రితో మాట్లాడుతున్న సర్వే ఉద్యోగులు

సర్వేయర్ల సమస్యలపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సర్వే, భూ రికార్డుల శాఖ ఉద్యోగులు తమ సమస్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతి అందించారు. అశోక్ బంగ్లాలో గురువారం నిర్వహించిన మంత్రి లోకేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితిని కలిసి తమ సమస్యలను సర్వేయర్లు వివరించారు. సర్వే అధికారి సరెండర్‌ను రద్దు చేయాలని, సర్వేయర్లకు, ఉప సర్వే పరిశీలకులకు జారీ చేసిన మెమోలను వెనక్కి తీసుకోవాలని కోరారు. పనిభారం పెంచి, ఒత్తిడి చేసే నిర్ణయాలను చేయొద్దని విజ్ఞప్తిచేశారు. వెంటనే మంత్రి శ్రీనివాస్ స్పందిస్తూ కలెక్టర్, ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని హామీనిచ్చారు.

28న ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలకు ఈ నెల 28న జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.రజనీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 28న మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో ఈ ఎంపికలు చేపడుతున్నట్లు చెప్పారు. వివరాల కోసం 8374543094 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

22వ డివిజన్‌లో ఎసి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 22వ డివిజన్ పరిధిలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు గురువారం పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ బవిరెడ్డి సతీష్‌తో కలిసి పర్యటించిన ఆయన స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడక్కడ కాలువ సమస్యలు ఉన్నట్లు ప్రజలు తమ దృష్టికి తెచ్చారని, వాటిని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిపిఒ అప్పలరాజు, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పల్లెపండగ పనులు వేగవంతం

- త్వరలో రెండో విడత గోకులాలు మంజూరు
- ప్రహరీల నిర్మాణాన్ని ప్రారంభించకపోతే రద్దు
- ఉపాధి హామీ పనులపై కలెక్టర్ అంబేద్కర్ సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

పల్లె పండగ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. మొదటివిడత గోకులాల నిర్మాణాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఉపాధిహామీ పనులపై తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఒలు, ఎపిఎంలు, పిఆర్ ఎఇలకు పలు ఆదేశాలను జారీ చేశారు. పల్లెపండగ కార్యక్రమం కింద జిల్లాలో 2042 సిసి రోడ్ల పనులు మంజూరు చేయగా, వీటిలో ఇప్పటివరకు 1969 రోడ్ల నిర్మాణాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 965 పనులు పూర్తయ్యాయని, 315 పనులు ప్రగతిలో ఉన్నాయని, వీటిని వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేజ్ అప్‌డేషన్ కింద చేపడుతున్న 597 పనులను పదిరోజుల్లో పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఉపాధిహామీ కన్వర్జెన్స్ కింద రూ.288 కోట్లతో వివిధ పనులను మంజూరు చేశామని, వీటిని మార్చి నెలాఖరులోగా శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు సుమారు రూ.52 కోట్లు విలువైన బిల్లులను అప్‌లోడ్ చేశారని, మిగిలిన వాటిని కూడా వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పని పూర్తయిన ఒక్క బిల్లు కూడా పెండింగ్ ఉండటానికి వీల్లేదన్నారు. మరో వారం రోజుల్లో బిల్లులన్నీ మంజూరవుతాయని చెప్పారు.

గోకులాల నిర్మాణం

మొదటి విడత 996 గోకులాలను మంజూరు చేయగా, 994 గ్రౌండింగ్ అయ్యాయని, వీటిలో 431 పూర్తయ్యాయని కలెక్టర్ చెప్పారు. ఐదు రోజుల్లో మిగిలినవాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. వీటిని పూర్తి చేయించే బాధ్యత డ్వామా ఎపిఒలదేనని స్పష్టంచేశారు. రైతుల దగ్గరకు వెళ్లి, వారిని చైతన్యపరిచి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఫిబ్రవరి మొదటి వారంలో రెండో విడత కింద సుమారు వెయ్యి గోకులాల నిర్మాణాన్ని ప్రారంభించాలని చెప్పారు. గోకులాలకు సంబంధించి సుమారు రూ.2 కోట్ల విలువైన బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఇక నుంచి క్షేత్రస్థాయిలో పనులను ప్రత్యక్షంగా పరిశీలిస్తామని చెప్పారు.

ప్రహరీగోడల నిర్మాణం

ఉపాధిహామీ కింద రూ.12.5 కోట్లతో 153 పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణాన్ని మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వరకు ఒక్కటి కూడా గ్రౌండింగ్ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారానికి అన్నింటినీ గ్రౌండింగ్ చేసి, మార్చినాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రౌండింగ్ చేయకపోతే పనులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్ఇ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరణ

కొట్టక్కి ఒంటరి మహిళ మృతి మిస్టరీని ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - రామభద్రపురం

కొట్టక్కి గ్రామంలో ఈ నెల 15న దండు సింహాచలం (63) అనుమానాస్పద మృతి కేసును వారం రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన దినసరి కూలీలే ఈ నేరానికి పాల్పడినట్లు రుజువైంది. ఈ మేరకు బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు గురువారం వివరాలను వెల్లడించారు. గ్రామానికి చెందిన లోపింటి గణేష్, ముత్యాల శ్రీను వివిధ పనులు చేసుకొంటూ జీవనం గడుపుతున్నారు. వీరికి నిత్యం మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ నెల 15న రాత్రి ఇద్దరూ కలిసి మద్యం తాగారు. పండగ రోజులు కావడం, పనులు లేకపోవడంతో మద్యం కోసం దొంగతనం చేయాలనే ఆలోచనకు వచ్చారు. అదే తడువుగా వీరు ఉన్న చోటికి సమీపంలో ఒంటరిగా ఉంటున్న మహిళ సింహాచలం ఇంట్లో దొంగతనం చేయాలనే పథకం వేశారు. ఆ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించి ఆమె బహిర్భూమికి వెళ్ళే సమయంలో లోపలికి ప్రవేశించారు. ఇంతలో లోపలికి వచ్చిన ఆమె కేకలు వేయడంతో గణేష్ ఆమె నోరు మూసి మంచంపై ఉన్న దిండు మొహంపై అదిమి పెట్టాడు. శ్రీను కదలకుండా కాళ్లు, చేతులు పట్టు కోవడంతో ఊపిరాడక ఆమె మరణించింది. ఇలా ఎవరైనా చూస్తే అనుమానం వస్తుందని భావించి, ఆమె మెడకు చీర కట్టి ఫ్యానుకు వేలాడదీసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. బీరువాను గొడ్డలి సాయంతో తెరచి అందులో ఉన్న 10 వేలు నగదు, సుమారు 3 గ్రాముల బంగారం చెవి దుద్దులు తీసుకొని ఉడాయించారు. బంగారాన్ని ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.16 వేలు తీసుకుని, పంచుకున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించిన పోలీసులు... గతంలో ఈ గ్రామానికి చెందిన పాత నేరస్తుల వివరాలు పరిశీలించి లోపింటి గణేష్‌పై అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించారు. దీంతో తనతో పాటు ముత్యాల శ్రీను కూడా నేరానికి సహకరించినట్లు గణేష్ అంగీకరించాడు. వీరిని అదుపులోకి తీసుకొని, సుమారు రూ.6 వేలు నగదు సీజ్ చేశారు. గణేష్, శ్రీను కేసు నమోదు చేసి సాలూరు కోర్టుకు తరలిస్తున్నట్లు సిఐ తెలిపారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు.

కణపాకలో తహశీల్దార్ కార్యాలయం

3వ పట్టణ పోలీస్‌స్టేషన్ నిర్మాణం ● స్థల పరిశీలన చేసిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని కణపాకలో అర్బన్ తహశీల్దార్ కార్యాలయం, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు భవన నిర్మాణానికి కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్ గురువారం స్థల పరిశీలన చేశారు. ఇక్కడ సర్వే నంబరు 15/1లో సుమారు ఎకరా స్థలాన్ని ఈ భవనాల నిర్మాణం కోసం పరిశీలించారు. తహశీల్దార్ కూర్మనాథరావును అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ స్థలాన్ని రెండు భాగాలుగా చేసి, సగం తహశీల్దార్ కార్యాలయానికి, మిగిలిన సగం పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించాలని ఆదేశించారు. వీరివెంట రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్

శ్రీనివాస్‌కు గిడుగు పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరానికి చెందిన రచయిత జి.వి.శ్రీనివాస్‌కు గిడుగు జాతీయ పురస్కారం లభించింది. గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్తంగా ఈ నెల 22న హైదారాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. శ్రీనివాస్‌కు గిడుగు జాతీయ పురస్కారం రావడంతో సాహితీవేత్తలు ఎన్.కె.బాబు, చీకటి దివాకర్, మంజరి, కథాస్రవంతి పప్పు భోగారావు, విశాఖ సంస్కృతి మాసపత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు, ప్రముఖ కవి మానాపురం రాజా చంద్రశేఖర్, తదితరులు అభినందనలు తెలియజేశారు.

గిడుగు పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

పిఇటిల సేవలు అభినందనీయం

ఎస్‌పి వకుల్ జిందాల్

విజయనగరంకోట : పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియలో పిఇటిలు అందించిన సేవలు అభినందనీయమని ఎస్‌పి వకుల్ జిందాల్ కొనియాడారు. ఈ మేరకు గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ డిసెంబర్ 30 నుంచి ఈ నెల 22 వరకు చేపట్టిన నియామక ప్రక్రియలో జిల్లాలోని పలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పిఇటిలుగా పనిచేస్తున్న వారి సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. పిఇటిలు కె.గోపాల్ (కస్పా హైస్కూల్), రాజు (గంట్యాడ), కె.లక్ష్మణ (చింతలపేట), జి.రవికుమార్ (గాజులరేగ), పి.లీలాకృష్ణ (పసుపాం), డి.ప్రవీణ్‌కుమార్ (విటి అగ్రహారం) 16 రోజులపాటు సేవలందించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

సచివాలయాలకు కొత్త బోర్డులు

విజయనగరంటౌన్ : నగరంలోని సచివాలయాలకు నూతన నామఫలకాలను ఏర్పాటు చేశారు. విజయనగరం ఔన్నత్యాన్ని ప్రస్ఫుటించేలా రూపొందించిన లోగోను ముద్రించి, ఆయా సచివాలయాలకు నామఫలకాలను అమర్చారు. దీంతో సచివాలయాలు కొత్త శోభ సంతరించుకున్నట్లయింది.

పారిశుధ్య పనులు పరిశీలన

నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణ కోసం పగలు, రాత్రి సమయాల్లో పనులు చేపడుతున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. గురువారం తెల్లవారుజామున నగరంలోని మయూరి జంక్షన్‌లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. సిబ్బంది నిర్ణీత సమయానికి హాజరవుతున్నారా? లేదా? అని తెలుసుకున్నారు. పారిశుధ్య కార్మికుల విధి నిర్వహణ కోసం కేటాయించిన సమయాలలో తప్పనిసరిగా ఉండాలని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కచ్చితంగా పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు.

నేడు విద్యుత్తు అంతరాయం

విజయనగరం టౌన్ : నగరంలో తోటపాలెం, విటి అగ్రహారం విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. తోటపాలెం సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్ పనులు, ఒంటితాడి సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, ఫీడర్లపై ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. తోటపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని బ్యాంకుకాలనీ, శ్రీరామ్ నగర్, గోపాల్ నగర్, ఇందిరా నగర్, నాగోజీపేట, రైల్వేస్టేషన్ రోడ్, బొత్సపేట, బాలాజీ నగర్, నాయుడుకాలనీ, సాయి నగర్, నరసింహ నగర్, సిద్ధార్థ నగర్ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. ఒంటితాడి సబ్‌స్టేషన్ పరిధిలోని విటి అగ్రహారం, ఇండస్ట్రియల్ ఏరియా, బిసి కాలనీ, ప్రదీప్ నగర్, మజ్జిపేట, రొంగలివీధి, సంతోష్ నగర్, ప్రియానగర్ , దుర్గానగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే అదితి, ఆమె సోదరి విద్యావతి

ంప్రజాశక్తి-విజయనగరం కోట

మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను స్థానిక అశోక్ బంగ్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఆమె సోదరి విద్యావతి దేవి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 41 కిలోల కేక్‌ను మూగ, చెవిటి విద్యార్థుల సమక్షంలో మంత్రి, ఎమ్మెల్యేలు కట్ చేశారు. ఆ విద్యార్థులను ఏడాది పాటు దత్తత తీసుకుని, రూ.1.68 లక్షలను నాయకులు విరాళాలు అందజేశారు. నగరంలోని మూడు అన్న క్యాంటీన్లలో మధ్యాహ్న భోజనం కోసం టిడిపి నాయకులు విజ్జపు ప్రసాద్, అవనాపు విజయ్, చిగురుపాటి కుటుంబరావు విరాళాలిచ్చారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, తెలుగు మహిళా పార్లమెంట్ కార్యదర్శి అనురాధ బేగం, ఎంపిటిసిలు రాజేష్‌బాబు, శంకర్రావు, దేవి ప్రసన్న, అబద్ధం, వి.శ్రీనివాసరావు, సర్పంచులు ఈశ్వరరావు, ఆదినారాయణ, మాజీ ఎంపిపి కంది సాయి జగ్గారావు, పాశి అప్పలనాయుడు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి

విజయనగరం టౌన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని జనసేన నాయకులు అవనాపు విక్రమ్ కోరారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని స్థానిక బాలాజీ నగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి విక్రమ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పత్తిగిల్లి వెంకటరావు, మండల సాయి లోకేష్, ముని లక్ష్మణరావు, నేరుడుబిల్లి చిన్నారావు, సంపత్ ఖాదర్, విశ్వ, కె.ఈశ్వరరావు, కె.రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమాలే శరణ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల తెలిపారు. విజయనగరంలో పలు పాఠశాలలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత విద్యారంగ పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. యాప్‌ల గోల ఇంకా తగ్గలేదని, ఆర్థిక బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని చెప్పారు. పిఆర్‌సి కమిషన్ వేసే సమయం కూడా దాటిపోయిందని, డిఎల ఊసే లేదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బుకారిబాబు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, నాయకులు రవి, సంపూర్ణలత, శ్రీనివాసన్, తదితరులు పాల్గొన్నారు.

సిటియులో పిజి ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నోటిఫికేషన్ విడుదల చేసిందని వైస్ ఛాన్సలర్ కట్టిమణి ఒక ప్రకటనలో తెలిపారు. సిటియులో 2025-26 సంవత్సరానికి గాను ఎమ్మెస్సీ- కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎంఎ- సోషియాలజీ, ఇంగ్లీష్, ట్రైబల్ స్టడీస్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, జాగ్రఫీ, ఎకనామిక్స్, ఎంబిఎ ప్రోగ్రాంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉడా కాలనీలోని ఒకేషనల్ శిక్షణ కేంద్రంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సంకల్ప్ సంస్థ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సును గురువారం జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్, జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ వడ్డాది హరీష్ ప్రారంభించారు. వ్యాపారాన్ని ఎలా ఎంచుకోవాలి, ఎలా ప్రారంభించాలి, ఎలా అభివృద్ధి చేసుకోవాలి, అనే విషయాలపై అవగాహన కల్పించారు. సదస్సులో ఐఎల్ఒ ట్రైనర్ వి.అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు క్షేత్ర సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉపాధిహామీ పనుల నిర్వహణపై జిల్లాలోని క్షేత్ర సహాయకులకు శుక్రవారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు డ్వామా పీడీ శారదా దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఉపాధి హామీ రాష్ట్ర డైరెక్టర్ వైవికె షణ్ముఖ కుమార్, కన్వర్జెన్స్ జాయింట్ కమిషనర్ జె.సునీత, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివ ప్రసాద్ పాల్గొంటారని చెప్పారు.

సోలార్ విద్యుత్తులో ఆదర్శంగా నిలవాలి

గజపతినగరం : సోలార్ విద్యుత్ వాడకంలో పురిటిపెంట జిల్లాకే ఆదర్శంగా నిలవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక శ్రీ కన్వెన్షన్ హాల్లో బొబ్బిలి డివిజన్ శాఖ పిఎం సూర్య ఘర్ యోజన అనే సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీపై అందజేస్తున్న సూర్యఘర్‌యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని జిల్లాలో తన నియోజకవర్గంలోని పురిటిపెంట గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామన్నారు. ఈ గ్రామంలో గల ప్రజలందరూ సోలార్ విద్యుత్తు వాడకంలో ముందంజలో నిలిచి జిల్లాకే ఆదర్శంగా నిలవాలన్నారు. భవిష్యత్తులో ఏర్పడి విద్యుత్ కష్టాలను అధిగమించాలంటే సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తౌడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పివివి గోపాలరాజు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే

రామభద్రపురం: రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలో ఉన్న అంతర్జాతీయ కూరగాయల మార్కెట్లో సీసీ రోడ్లు, మార్కెట్లో నిర్మించిన ప్లాట్‌ఫారాలను గురువారం బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఈ మార్కెట్ పట్ల ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం అకుంఠిత దీక్షతో పలు అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. దీనిలో భాగంగా మొదట ఈ నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నిధులు సమకూర్చి ఇంకా ఇక్కడ షెడ్లు కూడా నిర్మించే యోచన ఉందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు కరణం విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు హక్కుల పట్ల అవగాహన ఉండాలి

శృంగవరపుకోట: ఓటర్లు తమ హక్కులు, విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు తెలిపారు. పట్టణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఓటరు అక్షరాస్యత వేదిక తయారు చేసిన ఓటరు హక్కులు విధులు బాధ్యతలు తెలియజేసే కరపత్రాన్ని తహశీల్దార్, సహాయ ఓటర్ల ఎన్నికల అధికారి ఎం.అరుణ్ కుమారి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల ఉపతాహశీల్దారు పి.సునీత, రిటైర్డ్ తహశీల్దారు వేదిక ప్రతినిధి వి.సన్యాసప్పుడు, ఎల్ సాంబమూర్తి, ఆర్ సూర్యదేముడు, వెంకటేశ్వర్లు, డి ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

తెర్లాం: స్థానిక గ్రంథాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి సిహెచ్ కృష్ణమూర్తి ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు.

వేపాడ: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతిలో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, రెహమాన్, శ్రీవిక్టరీ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ రహమాన్, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

2న డెల్టా రాష్ట్ర స్థాయి పరీక్ష

బొబ్బిలి: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాష సామర్థ్య ప్రతిభ పాటవ పోటీపరీక్షల మాదిరి ప్రశ్నాపత్రాలను రాష్ట్ర ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బొబ్బిలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కే. మోహన్ రావు గురువారం విడుదల చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఇఒలు చల్ల లక్ష్మణ రావు, గొట్టాపు వాసుతో కలసి విడుదల చేశారు. డెల్టా అధ్యక్షుడు యం. విజయ మోహన్ రావు మాట్లాడుతూ ఈ పోటీ పరీక్షలను ఫిబ్రవరి 2న రాజా కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మారికకు ఎంపి భరత్

వేపాడ : మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామాన్ని విశాఖ ఎమ్‌పి శ్రీభరత్ శుక్రవారం సందర్శించనున్నారు. ఈ గ్రామానికి రహదారికి కావాల్సిన నిధులను మంజూరు చేసిన ఆయన పనులు ఏ విధంగా జరుగుతున్నాయా అని పరిశీలించేందుకు రానున్నారు. ఈ సందర్భంగా గిరిజనుల సమస్యలు కూడా ఆయన అడిగి తెలుసుకుంటారని ఎంపిడి సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్‌డిసి

ప్రజాశక్తి - వంగర

ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ జోషఫ్ అన్నారు. ఇటీవల మండలంలో వివిధ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఆయన గురువారం పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 115 దరఖాస్తులు వచ్చాయన్నారు. రీ సర్వే గ్రామ సభల్లో 692 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 14 సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు ఇవ్వనివారు కూడా వీటికి సంబంధించి ఏమైనా సమస్యలుంటే తహశీల్దార్ కార్యాలయంలో గాని, సచివాలయంలోను భూ హక్కు సర్వే నెంబర్లుతో సహ సరైన ఆధారాలతో దరఖాస్తు

వంగర: సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌డిసి జోషఫ్

చేస్తే వాటిని పరిశీలించి 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులలో సరైన ఆధారాలు లేని దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, తహశీల్దార్ డి.ధర్మరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలి

తెర్లాం: రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి నూకరాజు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వినతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని 293 వినతులు స్వీకరించగా వాటిలో 138 వినతుల్లో సమస్యలను పరిష్కరించామన్నారు. తహశీల్దార్ అందించిన నివేదిక మేరకు దరఖాస్తుదారులకు ప్రత్యేకాధికారి ఫోన్ చేసి వివరాల అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ సిబ్బంది ఎ.కృష్ణమూర్తి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి- డెంకాడ

వచ్చే మార్చి నాటికి నిరక్షరాసులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని వాలంటీర్ టీచర్లను ఎంపిడిఒ వై.భవాని కోరారు. వాలంటీర్ టీచర్ల రెండవ దశ ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ తీసుకున్న టీచర్లందరూ నిరక్షరాశులందర్నీ వచ్చే మార్చినాటికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం, వయోజన విద్యాశాఖ ఎపిఒ ధనలక్ష్మి, రిసోర్స్ పర్సన రాంబాబు, సిసిలు సూరిబాబు, మంజుశ్రీ, విఒఎలు సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ, రిసోర్స్‌పర్సన్ రామకృష్ణ, ఎపిఎం సులోచన దేవి ఆధ్వర్యంలో వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వయోజనులను అక్షరాస్యులుగా మార్చే బాధ్యత వాలంటీర్ టీచర్స్ తీసుకువాలని ఎంపిడిఒ కె.రామకృష్ణరాజు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ రెండవ విడత కార్యక్రమంలో భాగంగా వెలుగు వాలంటీర్ టీచర్స్‌కి వయోజన విద్య పై టిసిఎస్ వీడియో పాఠాలు మండల స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం ఎంఎల్ఒ టి.శ్రీనివాసరావు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్, పాల్గొన్నారు.

గజపతినగరం: నిరక్షరాస్యత లేని సమాజాన్ని నిర్మించాలని ఎంపిడిఒ బి.కల్యాణి అన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల సమైక్య శాఖ సహకారంతో గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో వాలంటీర్ టీచర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడులు మాట్లాడుతూ ఒక్కో వాలంటీర్ టీచర్‌కు 10 మంది సభ్యులను అప్పజెప్పామన్నారు. ఈ కార్యక్రమంలో డిడిఒ అల్లు సోమేశ్వరరావు, పాల్గొన్నారు.

కొత్తవలస: సమాజంలో నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస ముఖ్య ఉద్దేశ్యమని ఎంపిడిఒ ఎస్. రమణయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలో రెండవ విడత ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఎ. వెంకటరమణ, ఎంఎల్ఒ పి. రవికుమార్, టీచర్ ఐ.రవికుమార్, సిసిలు బి.ఎ.నాయుడు, భారతి, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : గ్రామాలలో ప్రతి ఒక్కరినీ అక్షరాసులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఎపియం పి.భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పి. నాగరాజు, ఎఒ డి.వి అప్పారావు,పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలో ప్రతి ఒక్కరు అక్షరాసులుగా మారాలని ఎంపిడిఒ కే.గాయత్రి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం జగదీష్, ఎంఎల్ఒ ఆళ్ల వైకుంఠరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రేగిడి: గ్రామాల్లో 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఎంపిడిఒ శ్యామల కుమారి, బాసిన గోవిందరావు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్ల ఉపాధ్యాయులతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వాలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

జంగిల్ తొలగింపు

వేపాడ: మండలంలోని సోంపురం నుంచి జాకేరు, కరకవలస, చామలాపల్లి, డిఆర్ పేట గ్రామాల మీదుగా ఆనందపురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్‌ను అధికారులు గురువారం తొలగించారు. వల్లంపూడి జంక్షన్, రామస్వామి పేట నుంచి కేజీపూడి వరకు కూడా పిచ్చి మొక్కలను జెసిబిలతో తొలగించారు. ఈ రోడ్డులో బస్సుల రాకపోకలకు ఆటంకం లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని ఆర్అండ్‌బి జెఇ స్వామి తెలిపారు. అయితే చిరుతపాలెం జంక్షన్ నుండి ఎం సింగవరం, బాణాది, బల్లంకి గ్రామాలకు వెళ్లే రోడ్డుకు కూడా ఇరువైపులా పిచ్చిమొక్కలు పేరుకుపోయి ఉన్నాయని వాటిని కూడా తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గణతంత్ర వేడుకలకు సర్పంచ్ ఎంపిక

కొత్తవలస: ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో ఎర్రకోటపై జరనున్న గణతంత్ర దినోత్సవాలకు కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల, పారిశుధ్య విభాగం, రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ పనితీరును కనబరిచిన ఆరుగురి సర్పంచులను, ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు ఎంపిక చేసింది. రాష్ట్రం నుంచే కాకుండా ఉత్తరాంధ్ర నుంచి ఎంపికైన ఒకే ఒక్కడుగా ఈ సర్పంచ్ నిలవడంతో కాటకాపల్లి గ్రామంలో సందడి నెలకొంది. తమ గ్రామం పేరును మరింత ముందుకు తీసికువెళ్తూ, ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

బియ్యం మోసిన బేబినాయన

బొబ్బిలి: మార్కెట్ యార్డులో గోదాంలో పౌర సరఫరాల బియ్యం నిల్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబినాయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లారీలో ఉన్న బియ్యం బస్తాను బేబినాయన మోశారు. రైతులు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం నుంచి తయారు చేసిన బియ్యాన్ని స్టాక్ చేస్తున్నట్లు చెప్పారు.

పాతపద్ధతినే కొనసాగించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పాత పద్ధతిలోనే స్కూల్ కాంప్లెక్స్‌లను కొనసాగించాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి. ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా చోటు చేసుకున్న అసంబద్ధ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌లను కొనసాగించాలన్నారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గా కొనసాగించాలన్నారు.మున్సిపల్ పాఠశాలల పట్ల ఎంఇఒ వైఖరి మారాలన్నారు. బొబ్బిలి మున్సిపల్ క్యాడర్ స్ట్రెంగ్థ్ ఎస్‌జిటి 72, బొబ్బిలి మండల ఎస్‌జిటి క్యాడర్ స్ట్రెంగ్థ్ 151 ప్రకారం పట్టణానికే కేటాయించాల్సిన రెండు పాఠశాలలను స్కూల్ కాంప్లెక్సీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు డిజెకె కిరణ్, ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు, పి.సారదాదేవి, యం. పకిర్, పి.సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెటర్లు, విద్య సామగ్రి వితరణ

ప్రజాశక్తి - జామి

జామిలోని మాధవరాయమెట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రి, స్వెట్టర్లును గురువారం సీనియర్ జర్నలిస్టు నాగరాజు ఆధ్వర్యంలో విజయనగరం 1వ, రెండవ పట్టణ సిఐలు ఆర్థిక సాయంతో పంపిణీ చేశారు. విజయనగరం ఒకటవ పట్టణ సిఐ ఎస్. శ్రీనివాస్, జామి ఎస్ఐ వీర జనార్ధన్, ఎంఇఒ-2 కె. గంగరాజు, ప్రముఖ న్యాయవాది బివి.రమణారావు, చింతాడ నర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యంలు హాజరై విద్యార్థులకు సామాగ్రిని పంపిణీ చేశారు. సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కూలీలుగా ఇక్కడకు వచ్చిన వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకుంటున్నారని వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఇటువంటి కార్యక్రమాలు చాలా అవసరమన్నారు.

పాఠశాల పరిస్థితి చూసి.. చలించి..

పంపిణీ కార్యక్రమానికి తన భర్త, ఒకటవ పట్టణ సిఐ శ్రీనివాస్‌తోపాటు కార్యక్రమానికి వచ్చిన సిఐ సతీమణి నీరజ పాఠశాల పరిస్థితిని, విద్యార్థుల సౌకర్యాలను గురించి తెలుసుకుని చలించిపోయారు. వెంటనే ఆమె పాఠశాలకు పూర్తిగా రంగులు వేయించి అందంగా తయారు చేయాలని రూ.10వేల నగదును పాఠశాల హెచ్‌ఎం, పేరెంట్స్ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కిలో కౌసల్య పాల్గొన్నారు.

డ్రోన్‌తో పురుగు మందుల స్ప్రే

ప్రజాశక్తి- డెంకాడ

డ్రోన్ల సహాయంతో వ్యవసాయానికి మందులు స్ప్రే చేస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎఒ పి.నిర్మల తెలిపారు. మండలంలోని అక్కివరంలో మొక్కజొన్న పంటకు డ్రోన్ల సహాయంతో పురుగు మందులను గురువారం స్ప్రే చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ డ్రోన్లు వాడడం వల్ల తక్కువ సమయం పడుతుందన్నారు. తక్కువ కూలీలు ఉపయోగపడతారని, సమతుల్యంగా జరుగుతుందని, సులభంగా పని అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, ఎపి సిఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్, విజయనగరం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నాగభూషణరావు, డెంకాడ పూసపాటిరేగ, భోగాపురం మండలాల వ్యవసాయ అధికారులు అభ్యుదయ రైతులు గ్రామ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలిపల్లి పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి జీవన్ రాణి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఇటీవల సోకిన అతిసార కేసుల వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నాలుగు కేసులు వచ్చాయని భోగాపురం, భీమిలి ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆరోగ్యంగానే ఉన్నారని సిహెచ్ఒ జయకుమారి డిఎంహెచ్ఒకు తెలిపారు. అతిసార వ్యాధిపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో బావుల్లో క్లోరినేషన్ చేయించాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఆసుపత్రికి నిత్యం వస్తున్న రోగులు ఎంత మంది? ఎంతమందికి చికిత్స చేశారు? ఎంతమందికి రక్త పరీక్షలు చేస్తున్నారని ల్యాబ్ టెక్నీషియన్‌ని అడిగి సంబంధిత రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇంటింటికి జరుగుతున్న లెప్రసీ సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. కుక్క కాటు ఇంజెక్షన్లు నిల్వలపై ఆరా తీశారు. అనంతరం సిబ్బది హాజరు పట్టికను పరిశీలించారు.

ఇంటింటి కొళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామ పంచాయతి గంగిరెడ్లపాలెంలో సుమారు రూ.4 లక్షల మండల పరిషత్ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ఎంపిపి సండి సోమేశ్వరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు, వైస్ ఎంపిపి, ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఇందుకూరి సుధారాణితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, తిమిడి సర్పంచ్ వబ్బిన త్రినాధమ్మ, ఎంపిటిసి పడాల ధర్మారావు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇఇ ఝాన్సీ, నీటి సంఘం చైర్మన్ వబ్బిన కాటమయ్య, మాజీ సర్పంచ్ కారుకొండ వెంకటరావు, మాజీ ఎంపిటిసి బోజంకి గోవింద్, ఎస్ కోట వార్డు మెంబరు కృష్ణవేణి, రేవాళ్ళపాలెం సర్పంచ్ రామకృష్ణ, పోతనాపల్లి మాజీ సర్పంచ్ పోతయ్య, మోపాడ శ్రీను, యువ నాయకులు వబ్బిన సతీష్, సచివాలయం సెక్రటరీ బంగారు నాయుడు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

పట్టణ కేంద్రంలోని స్థానిక పుణ్యగిరి రోడ్డులో పంచాయతిరాజ్ శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న బాడ్మెంటన్ కోర్టులో రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఈ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌కోటలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న శిరిడి సాయి ప్రాంగణంలో శ్రీనాథ్ భాస్కరరావు, శిరిడి సాయి కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైదుయలు పి.దివ్య, కోఆర్డినేటర్ ఎస్.జోగారావు, కంటి వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు చేసి 35 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శిరిడి సాయి కమిటీ 500 మందికి అన్నదానం చేశారు. ఆపరేషన్‌కు ఎంపికైన 35 మందిని శంకర్ ఫౌండేషన్ బస్సులో ఆసుపత్రికి తరలించారు.

జాతీయ స్థాయి తైక్వాండోకు ఎంపిక

ప్రజాశక్తి- బొబ్బిలి

హైదరాబాద్ విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 28, 29, 30న జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలి క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ బంకురు ప్రసాద్ చెప్పారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో చదువుతున్న ఎస్.జాజిలి, డి.ఆదిత్య, బి.శివరామకృష్ణ ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కోటలో గురువారం ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి బొబ్బిలికు గుర్తింపు తీసుకురావాలని బేబినాయన కోరారు.

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాము

విద్యార్థులకు బంగారు పతకాలు

గరివిడి రూరల్: మండలంలోని కాపుశంభాం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆర్ట్, క్రాఫ్ట్, డ్యాన్సు విభాగాల్లో బంగారు పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాము తెలిపారు. ఇటీవల మండపేటలో మదర్ థురిస్సా ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో పాఠశాలకు చెందిన లావేటి రాఘవ, వండాన తేజస్విని, కనిమెరక యామిని దుర్గశ్రీ, గొర్లె కుమారిలు బంగారు పతకాలు సాధించారన్నారు. క్రాఫ్ట్ విభాగంలో చందక హారిక, లెంక లిఖిత, వండాన తేజస్విని, గొర్లె గౌతమ్ బంగారు పతకాలు, డాన్సులో చీమల దేవి, చీమల కుసుమ, వండాన యమున, వండాన ధనలక్ష్మి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు సాధించినట్లు ఆయన తెలిపారు. పై మూడు విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు అద్దాల కుమార్, జివి శ్రీదేవి, మావుడూరి పద్మజలను ఆయనతో పాటు విద్యా కమిటీ చైర్మన్ పిన్నింటి రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని సిఐ రామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుకు అనుకొని రెండు హై క్వాలిటీ (8ఎమ్‌పి) కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద జరిగే హిట్ అండ్ కేసులు, స్నాచింగ్, దొంగతనాలు, ఇతర నేరాలను నిరోధించడానికి, జరిగిన నేరాలు వేగంగా ఛేదించడానికి ఈ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. త్వరలో మరికొన్ని జంక్షన్‌లో ప్రజల సహకారంతో కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి. గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని నిరసన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ గ్రామానికి ఉన్న రోడ్డు నిర్మాణం పనులు మధ్యలో నిలిచిపోయాయని, మూడు సంవత్సరాల కావస్తున్నా పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ నెల 27వ తేదీ లోగా పనులు చేపట్టకపోతే 27వ తేదీ నుండి ధర్నా చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాటల తూటా, బహుజన యువజన నాయకుడు ఆతవ ఉదయ భాస్కరు, మాజీ సర్పంచ్ బోని నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ప్రధాన రహదారి సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్‌కి వెళ్లే రోడ్డులో ఆతవ జంక్షన్ మలుపు వద్ద గురువారం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. రోడ్డుకు అడ్డంగా బోల్తా పడటంతో సుమారు గంటన్నర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న వల్లంపూడి ఎస్ఐ బి.దేవి స్పందించి సిబ్బందితో రాకపోకలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టారు. రోడ్డు మధ్యలో గడ్డి ట్రాక్టర్ బోల్తా పడినప్పటికీ ఎవరికీ గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

8 మంది అరెస్టు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని మోపాడ సమీపంలో పేకాటాడుతున్న 8 మంది జూదర్లను పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. మామిడి తోటలో పేకాటాడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 1,27,130 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐదు సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ సీజ్ చేసామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టుకు తరలిస్తామన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వాహన తనిఖీల్లో భాగంగా మొయిద బ్రిడ్జి దగ్గర రోడ్డు మీద వాహనాలు తనిఖీ చేస్తుండగా గుర్ల వైపు నుంచి విజయనగరం వైపు వెళుతున్న ఒక వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 15 పశువులను పట్టుకున్నామని ఎస్ఐ గణేష్ తెలిపారు. ఈ పశువులని వీరు అచ్చుతాపురం సంతలో కొని అలమండ సంతకి తరలిస్తున్నట్లు చెప్పారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - వంగర

మండలంలోని కోతుల గుమ్మడ గ్రామంలో రాజాం ఎక్సైజ్ సిఐ ఆర్. జైభీమ్ గురువారం దాడులు నిర్వహించి బొత్స మురళి అనే వ్యక్తి వద్ద 3.6 లీటర్ల నాటుసారను స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్ర ఐటి మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్, నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర పరిశీలకులు (విశాఖ నార్త్) సువ్వాడ రవిశేఖర్ హాజరై రామతీర్థం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం గొర్లిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ వనజాక్షి, గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, రాజప్పన్న, నల్లం శ్రీను, బొంతు వెంకటరమణ, తిరుపతిరావు, తాడ్డి సత్యనారాయణ, అవనాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బేబీ నాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు హాజరయ్యి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ,

నెల్లిమర్ల: పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని పోలిపల్లిలో మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలను మార్క్ షెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రక్తాన్ని ఇచ్చారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. నాయకులు పసుపులేటి గోపి, నీలాపు అప్పలరామరెడ్డి, కర్రోతు రాజు, కోరాడ తాతారావు, అప్పలస్వామి, పోల రామ సూరి, రౌతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: తిమిడి గ్రామంలో ఎంపిపి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల్లో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధరాజు, జనసేన నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట సర్పంచ్ సంతోసి కుమారి, తిమిడి సర్పంచ్ వబ్బిన త్రినాదమ్మ, వసి మాజీ సర్పంచ్ కారుకొండ వెంకటరావు, పెద్దలు బొడ్డు చిన్నయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గుర్ల: మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలను గురువారం గుర్ల పార్టీ కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పంచి పెట్టారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాంమల్లిక్ నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుములరాజు కిరణ్ కుమార్, మాజీ ఎంపిపిలు పైల బలరాం,సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
M.V.O.P 184/2024

Between :
Kolli Lakshmana .....Petitioner
And :
Jalapari Narayana Rao and others ......Respondents

Notice to R-1
Jalapari Narayana Rao, S/o Thoudu, Driver, Chouduwada Village, Pusapatirega Mandal, Vizianagaram District.

ఇందుమూలముగా మీకు తెలియజేయునదేమనగా పై నెంబరు కేసులో పిటిషనరు మీకు అనేకసార్లు నోటీసులు పై కోర్టువారి నుండి పంపినా మీరు తీసుకోనందున పై పిటిషను మీకు నోటీసు నిమిత్తం తే 13-2-2025దీకి వాయిదా వేసిరి. పై కేసులో మీకు ఆక్షేపణలున్న ఎడల **తే 13-2-2025దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టులో హాజరై మనవి చేసుకొనవలెను. లేనిచో పై పిటిషను మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు
J. Bheemasena Rao
Advocate for Petitioner,
Vizianagaram,
Cell: 9441053628

ప్రకటన
మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ జిల్లా జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు
G.W.O.P. No. 1/2025

Between :
శ్రీమతి దాసరి రోజారమణి ......పిటిషనరు
And :
Nill ....రెస్పాండెంటు

పై నెంబరు GOP 1/2025 పిటిషనులో, పిటిషనరైన దాసరి రోజారమణి, రెడ్డి చరణ్ వెంకటసాయిరాంకి తల్లిగారున్ను మరియు గార్డియన్ అయియున్నారు. వీరిద్దరికి రెడ్డి క్రిష్ణారావు మరణానంతరం Closs-1 Legal Heirsగా, విజయనగరం, సెకెండు బిట్, సర్వే నెం. 220/13 ప్లాట్ నెం.9, పడమర భాగంలో 217.69 చ॥గ॥ విస్తీర్ణం గల గృహ నివేశన స్థలం దఖలు పడగా, సదరు స్థలం బుద్దరాజు శ్రీరామ మూర్తిరాజుకి అమ్మజూపి వారి వద్ద నుండి కొంత సొమ్ము అడ్వాన్సుగా పుచ్చుకుని షరతులతో కూడి తే 13-12-2024దిని ఒక క్రయ పురోణి వ్రాయించి ఇచ్చియున్నారు. అందువలన సదరు మైనరు తరపున పై ఆస్థిలో సగం వాటా విక్రయించుటకు గాను అతని తల్లిగారైన దాసరి రోజారమణి గార్ని గార్డియన్‌గా నియమించమని కోరుచూ పై పిటిషను విజయనగరం జిల్లా కోర్టులో దాఖలు చేసినందున, అందుకు ఇతరలెవ్వరికైన, ఎవ్విధమైన ఆటంక, అవరోధములు, ఆక్షేపణలు యున్న ఎడల పై కోర్టులో **తే 10-2-2025దిని ఉదయం 10-30 నుండి సాయంత్రం 5.00 గంటల** మధ్య ఖుద్దున గాని, వకీలు గారి ద్వారాగాని తెలియపర్చుకోగలరు. లేని యడల పిటిషనరు తరపున తీర్పు వెలువరించెదరని యావన్మందికి ఇందుమూలంగా తెలియజేయడమైనది.

S.N.M Raju
Advocate,
Vizianagaram,

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ వారి కోర్టులో
I.A 79/2023 O.S 47/2019

Between :
మీసాల అప్పలనాయుడు .....వాది
And :
లెంక శ్రీనివాసరావు (died)
లెంక నారాయణస్వామి మరియు 5గురు ....ప్రతివాదులు

7వ రెస్పాండెంటు - ప్రతివాది : లెంక జగదీశ్వరరావు S/o నారాయణస్వామి, చల్లపేట గ్రామం, మెంటాడ మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన లెంక శ్రీనివాసరావు (died) వాది వద్ద అప్పు తీసుకుని ప్రోనోటు వ్రాయించి ఇచ్చినారు. సదరు ప్రోనోటు ఆధారం చేసుకుని వాదిపై కోర్టులో OS 47/2019 నెంబరు గల దావాను దాఖలు చేసుకుని యున్నారు. సదరు దావా విచారణకు వచ్చు సమయము నాటికి మీ సోదరుడు అయిన లెంక శ్రీనివాసరావు చనిపోయినారు అని శ్రీ కోర్టువారికి తెలియపరచినారు. పిమ్మట సదరు లెంక శ్రీనివాసరావు యొక్క వారసులు మరియు కుటుంబ సభ్యులు మరియు ఆస్తి వాటా దారులు అయిన మిమ్మల్ని సదరు దావాలో పార్టీలుగా అనగా ప్రతివాదులుగా చేర్పించమని IA 79/2023 పిటిషను దాఖలు చేసి యున్నాము. సదరు దావాలో మీరు కోర్టుకు సదరు **తే 18-02-2025దిన ఉదయం గం॥ 10-30 నిమిషాల**కు మీరు స్వయంగా కాని లేక మీరు బొగట్టా ఇచ్చిన ప్లీడరు గారు ద్వారా కాని పై కోర్టులో హాజరు కావలసినదిగా ఆజ్ఞాపించడమైనది. పైన చెప్పబడిన తారీఖున మీరు హాజరు కాకుండా తప్పన యెడల మీరు పరోక్షమందు పై వ్యాజ్యమును (దావా) విమర్శచేసి తీర్మానించుట జరుగునని మీరు తెలుసుకోవలసినది అని ఈ ప్రకటన ద్వారా తెల్పడమైనది.

శ్రీ కె.రమణాజి, AP451/1986
న్యాయవాది, గజపతినగరం,
విజయనగరం జిల్లా,
సెల్ : 9849343322